ఈవారం కథ

ఊడిగ మధువాణి

# ఓ హ్హాహ్హా
# హా హ్హాహ్హా

"అహ్హాహ్హా! అహ్హాహ్హా!!"


ఎక్కడో గుహల్లోంచి ప్రతిధ్వనిస్తున్నట్లు వికటాట్టహాసం! ఎయిర్ కండిషన్డ్ లాబ్‌లో కార్బన్–14 టెస్ట్ రిజల్ట్సు చూస్తున్న డా. బోసు ఉలిక్కిపడి, అయోమయంగా చుట్టూ కలయజూశాడు.

లాబ్‌లో అతనొక్కడే వున్నాడు. కంప్యూటర్ చేసే సన్నని శబ్దం తప్ప అంతా నిశ్శబ్దం!

చుట్టూ రకరకాల పరికరాలు–కంప్యూటర్లు – ఫాజిల్ శాంపిల్స్! ఒక్క సెకను కళ్ళు మూసుకుని, తల గట్టిగా విదిలించాడు.

అప్పటివరకు ఏకాగ్రత వలన బిగుసుకున్న పెదవులు అప్రయత్నంగా విచ్చుకున్నాయి –

"హెల్యూసినేషన్!" గొణుక్కున్నాడు! చిన్నగా నవ్వుకుంటూ. మరుక్షణంలో కంప్యూటర్ ఇస్తున్న సమాచారాన్ని ఆసక్తిగా స్టడీ చెయ్యడంలో మునిగి పోయాడు.



"ఓ... హ్హాహ్హా..... ఓ హ్హాహ్హా!!!" ఈసారి మరింత స్ఫుటంగా! డా. బోసు చేతిలో పెన్సిల్ జారిపడి పోయింది – బిత్తరపోయి, తల తిప్పి చూశాడు – వెనక్కి. ఏమీ లేదు. అంతా మామూలుగానే వుంది. అతనికి తెలియకుండానే గుండె వేగం పెరిగింది; శరీరం సన్నగా కంపిస్తోంది. ఎయిర్ కండిషన్డ్ రూమ్‌లో స్ఫటికాల్లా మెరుస్తూ, నుదుటి మీద స్వేద బిందువులు! లాబ్‌ని ఆనుకుని వున్న కోల్డ్ రూమ్ వేపు చూశాడు – బెదురుతూ తలుపులు వేసి వున్నాయి. ఒణుకుతున్న కాళ్ళను స్వాధీనంలోకి తెచ్చుకుంటూ ఆ గది వేపు నడిచాడు. తలుపులు తీసి భయం భయంగా లోపలికి తొంగి చూశాడు. అక్కడ వాతావరణం మంచు కొండల్లో వున్నట్టుంది! ఆ గది అతి పరిశుభ్రంగా, కాలుష్యానికి. అతీతంగా ఏ వస్తువునైనా తాజాగా వుంచగలదు. విశాలమైన ఆ గది మధ్యలో ఓ టేబిల్ – దాని చుట్టూ కొన్ని పరిశోధనా పరికరాలు, ఫ్రీజింగ్ యంత్రాలు చేస్తున్న ధ్వని భీతిగొలుపుతోంది! గదిలో ఎవరూ లేరు – ఆ కళేబరం తప్ప!

నెమ్మదిగా నడుస్తూ గది మధ్యలో వున్న టేబిల్ వద్దకు వెళ్ళాడు. దాని మీద సుమారు 5,300 సంవత్సరాల నాటి మానవ కళేబరం! పాతిక ముప్పై సంవత్సరాల వయసున్న యువకుడిది. మాంసము, చర్మము ఎముకలకు అతుక్కుపోయి – ఎండు ఖర్జూరంలా వున్నాడు. మీద పడబోతున్న మంచు ప్రవాహాన్ని అడ్డుకొనడానికి కాబోలు, ఎడం చెయ్యి మొహానికి అడ్డుపెట్టుకున్నాడు; దాదాపు కుడి వేపుకి ఒరిగిపోయి ఒక కాలికి చర్మంతో, గడ్డితో చేసిన బూటు! భారీ విగ్రహం – ఆ కళేబరం పక్కన దొరికిన రాగి గొడ్డలి, నడుము సంచి, ఇతర ఆయుధాలు కూడా భద్రపరిచారు. నడుంకి వున్న సంచీలో వున్న పండ్లను ఆ ప్రాంతంలో దొరికే ఓ రకమైన బెర్రీలుగా గుర్తించారు.

డా. బోసు నిర్వికారంగా ఆ కళేబరాన్ని చూస్తు

న్నాడు. ముఖ్యంగా తలను! ముఖం వికారంగా వుంది – అయినా ఏదో జీవకళ కన్పిస్తోంది! పెదవులు ఎండిన ఆల్ బక్రాల్లా వున్నాయి. విడివడిన పెదవుల మధ్య కాస్త అరిగిపోయిన పళ్ళు – చిగుళ్ళతో పాటు వికృతంగా కన్పిస్తున్నాయి. చనిపోతున్నప్పుడు భయంతో విప్పుకున్న కళ్ళు అలాగే గాజు గోళీల్లా వున్నాయి. ముక్కు అరిగిపోయి వుంది – వెంట్రుకలు లేవు!

ఒకప్పుడు ఆ మనిషి చర్మం తెల్లగా నిగనిగలాడి వుంటుంది. నూతన యవ్వనంతో ఆ పెదవులు పండిన ఆల్ బక్రాల్లా వుండి వుంటాయి. బలశాలిలా – యోధుడిలా కన్పిస్తున్నాడు. ఏమిటో మానవ జీవితాలు! బ్రతికి వున్నంత వరకు రకరకాలుగా విర్రవీగే మానవుడు మరణించాక ఎంత 'హంబుల్'గా మారతాడు! పీక్కుతినే క్రిమికీటకాలను అదిలించలేడు – ముక్కలు ముక్కలుగా కోసి పాఠాలు నేర్చుకునే 'మెడికోల'ను విదిలించలేడు! ఈ మాత్రం దానికే మానవుడికి అంత అహంకారం ఎందుకో! వేదాంతం ఆలోచిస్తున్నాడు బోసు. ఆ మృత కళేబరాన్ని చూస్తూ.

అది ఇటీవల ఇటలీకి; ఆస్ట్రియాకి నడుమ వున్న ఆల్ప్స్ పర్వతాల లోయల్లో – ఓ హియలీ నదంలో దొరికింది. వెంటనే వివిధ రంగాలకి చెందిన సైంటిస్టులు రంగంలోకి దూకి, ఆ కళేబరం వివరాలు పరిశోధించడానికి పూనుకున్నారు.

డా. బోసు ఆ కళేబరం తాలూకా కణాల్లోంచి కొన్ని శాంపిల్స్ తీసి, దాని జీన్స్ మీద పరిశోధనలు చేస్తున్నాడు. ఆ ఆదిమానవుడి జాతి, ఆహారపు టలవాట్లు, ఒంట్లో వున్న వ్యాధులు ఇత్యాది వివరాలు పరిశోధించడం ప్రస్తుతం ఆయన చేస్తున్న పని.

ఆ డెడ్ బాడీని చూస్తున్నప్పుడు ఆయనకు సంభ్రమంతో పాటు వేదాంతం కూడా ముంచుకొస్తోంది.

ఆలోచనల నుంచి తేరుకుని, గట్టిగా నిట్టూర్చి, బయటికి వెళ్ళబోయాడు – అంతలో మళ్ళీ వికటాట్టహాసం!

*గుండె ఆగిపోయేంత భయంకరంగా ఆ నవ్వు గదంతా ప్రతిధ్వనిస్తోంది వికృతంగా!*

డా. బోస్ స్థాణువులా నిల్చుండిపోయాడు. కొన్ని క్షణాలు అతని ఇంద్రియాలు పనిచెయ్యడం మానేశాయి; గుండె మాత్రం రెట్టింపు వేగంతో పనిచేస్తోంది. నీళ్ళు గుమ్మరించినట్లు స్వేదం – కోల్డ్ రూమ్‌లో!

ప్రయత్నించి, బలవంతంగా చైతన్యం తెచ్చుకుని, మెల్లగా వెనక్కి తిరిగాడు.

ఆది మానవుడి శవం వికృతంగా ఎండిపోయిన పెదవులతో నవ్వుతున్నట్లుంది... గాజు కళ్ళు వెక్కిరిస్తున్నట్లున్నాయి.

డా. బోస్ వెన్ను జలదరించింది – మొదటిసారిగా!

కంపిస్తున్న చేతులతో కళ్ళద్దాలు తీసి, కర్చీఫ్‌తో తుడిచి, చుట్టూ చూస్తూ నిలబడ్డాడు. జారిపోతున్న ధైర్యాన్ని చిక్కబట్టుకుంటూ "డామిట్! అంతా భ్రాంతి" చిరాగ్గా గొణుక్కుంటోంటే మళ్ళీ కొన్ని వింత ధ్వనులు – గదంతా ప్రతిధ్వనిస్తూ.

"లాబ్నిన్ కిలత్ ఓస్ని పమా!" గంభీరమైన మగ కంఠం.

డా. బోస్ భృకుటి ముడిపడింది. చుట్టూ తల తిప్పి చూశాడు. ఎవరూ లేరు. గది నంగనాచిలా యథావిధిగా వుంది.

"ఎవర్నువ్వు? ఏమంటున్నావు – నా భాషలో



మాట్లాడు." బింకంగా గదమాయిస్తూ అన్నాడు. అతని మాటలు కూడా ప్రతిధ్వనిస్తున్నాయి.

బిగ్గరగా నవ్వు – ఉన్మాదంతో కూడినట్లు!

ఆ నవ్వుతో పాటు మళ్ళీ ధ్వనులు "లాబ్జిన్ కిలత్ ఓస్ని పమా!" డా. బోస్ ఆదిమానవుడి శవం వేపు చూశాడు. ... అనుమానంగా. అది వికృతంగా నవ్వుతూనే వుంది – మంచుకు బిగుసుకుపోయిన పెదవులు ఎన్నటికీ కలపలేక!

డా. బోసుకి తన మానసిక స్థితి మీద అనుమానం వేసింది – తెగించి, పరిగెత్తుతున్నంత వేగంగా లాబ్‌లోకి తిరిగి వచ్చాడు. అతన్ని వెంటాడుతూ, గదులన్నీ ప్రతిధ్వనించే ఆ వింతధ్వనులు మళ్ళీ మళ్ళీ అవే ధ్వనులు!

"లాబ్జిన్ కిలత్ ఓస్ని పమా!"

డా. బోసు చెవుల్లో వేళ్ళు పెట్టుకుని కూర్చున్నాడు – అతనికి తల తిరుగుతున్నట్లుంది –

ఇంతలో వెనుక నించి ఓ బరువైన హస్తం అతని బుజం మీద పడింది!

ఉలిక్కిపడి, ఒక్క వుదుటున లేచాడు., భయంతో తల తిప్పి చూశాడు.

డా. విలియమ్స్!

ఒక్కసారిగా నిట్టూర్చాడు – రిలీఫ్‌తో–

డా.విలియమ్స్ తెల్లబోయి చూస్తున్నాడు అతని ప్రవర్తనను.

"ఓహ్! నువ్వా – ఎవరో అని భయపడ్డాను." సర్ది చెబుతూ అన్నాడు బోస్.

"హేయ్! వాట్ హేపెన్? ఎందుకలా భయపడుతున్నావు? వింతగా చూస్తూ అడిగాడు విలియమ్స్.

ఓ క్షణం తటపటాయించి – "ఏం లేదులే" అనేశాడు. అతనికి తనకు కలుగుతున్న భ్రాంతిని బయటకు చెప్పబుద్ధి కాలేదు.

డా. విలియమ్స్ బోస్‌తో పాటు జీన్స్ స్టడీ చేస్తున్న మరో సైంటిస్ట్.

ఇద్దరూ కంప్యూటర్ ఇచ్చిన 'జెనిటిక్ ఇన్ఫర్మేషన్'ని డిస్కస్ చేస్తున్నారు.

వాళ్ళ ఏకాగ్రతను చెదరగొడుతూ మళ్ళీ వికటాట్టహాసం – దాని వెనుక "లాబ్జిన్ కిలత్ ఓస్ని పమా!" అంటూ అనే ధ్వనులు.

డా. విలియమ్స్ బిత్తరపోయి బోస్ వేపు చూశాడు అతని కళ్ళలో బెదురు.

"నీకూ కూడా వినిపించిందా?" డా. బోస్ అడిగాడు నిబ్బరంగా చూస్తూ తనతో పాటు ఆ గదిలో మరో ప్రాణి వుండడం వలన బోస్‌కి ధైర్యం వచ్చింది.

"అవును – ఏమిటది?" అయోమయంగా చూస్తూ అన్నాడు డా. విలియమ్స్ "ఇందాకట్నుంచి వింటున్నాను. అయితే ఇది నా భ్రాంతి కాదన్న మాట"! డా.విలియమ్స్ కళ్ళు భయంతో పాలిపోయింది; ఆ మాటలకు మళ్ళీ మళ్ళీ నవ్వులు – ధ్వనులు!

డా. విలియమ్స్ కళ్ళు భయంతో చలిస్తున్నాయి. ఏ క్షణానైనా అక్కణ్ణుంచి పారిపోవడానికి సిద్ధంగా వున్నాడు. కాని, కాళ్ళు కదపలేక జిగురు వేసి అతికించినట్లు, కుర్చీకి అతుక్కుపోయి కూర్చున్నాడు డా. బోస్‌కి ఇప్పుడు పూర్తిగా బెదురుపోయింది... దాని స్థానంలో కుతూహలం, ఉత్సాహం చోటు చేసుకున్నాయి.

"హే కమాన్ విలియమ్స్ – ఆ ధ్వనులకి అర్థం కంప్యూటర్ ద్వారా తెలుసుకుందాం – లే!" అంటూ ఆ లాబ్‌లో మరో పక్క వున్న ఓ కంప్యూటర్‌ని ఆన్ చేశాడు. ఆ కంప్యూటర్ వందల కొలది భాషల్ని క్షణాల్లో ట్రాన్స్‌లేట్ చెయ్యగలదు? అవి ప్రాచీన భాషలైనా – లేక ఆధునిక భాషలైనా!

అప్పటి వరకు చాలాసార్లు విన్న "లాబ్జిన్ కిలత్ ఓస్ని పమా!" అన్న ఆధునిక భాషలైనా!

అప్పటి వరకు చాలాసార్లు విన్న 'లాబ్జిన్ కిలత్ ఓస్ని పమా!" అన్న ధ్వనులని కంప్యూటర్‌కి ఫీడ్ చేశాడు.

కంప్యూటర్ క్షణాల్లో వివరాలందించింది.

అది అతి ప్రాచీన భాష – సుమారు 5,500 సంవత్సరాల నాటిది! ఇప్పుడు వున్న ఆధునిక భాషలకు మూల భాషలైన ఆంగ్లోసాక్సన్, ఇండో–ఆర్యన్ భాషలకే మూల భాష! ఆది మానవుడి భాష!

కంప్యూటర్ వివరాలతో పాటు ఆ ధ్వనులను ఇంగ్లీషులోకి అనువదించింది.

"ఏం నాయనా... నా గురించి అన్నీ తెలుసుకోగలిగేంత మొనగాడివా"? సైంటిస్టులు సంభ్రమాశ్చర్యాలతో ముఖాలు చూసుకున్నారు.

ప్రొ.. బోసుకి ఉత్సాహం ఉబికి వచ్చింది –" యురేకా!" అని అరవాలనిపించినా, అరవకుండా నోరు మూసుకుని, చక చకా కంప్యూటర్‌కి ఆదేశాలివ్వడం మొదలు పెట్టాడు.

డా.విలియమ్స్ కూడా అతనికి సహాయం చెయ్యడం మొదలు పెట్టాడు. డా. బోస్ కంప్యూటర్‌కి, తను ఇంగ్లీషులో మాట్లాడే మాటలను ప్రాచీన భాషలోకి తర్జుమా చేసి, ధ్వని తరంగాలను గాలిలోకి వదలమని ఆదేశాలిచ్చాడు.

కంప్యూటర్ అనువాదకుడిలా పనిచెయ్యడం మొదలు పెట్టింది. "హలో! గ్రేట్... గ్రేట్... గ్రేట్....... గ్రే...ట్ గ్రాండ్ ఫాదర్‌గారు హౌ డూయూ డూ– మీరు మాకు కన్పించరా?" ఉద్వేగంతో అడిగాడు డా. బోసు; కన్పించని అ శరీర వాణిని.

"కన్పిస్తున్నానుగా.... ఆ బల్ల మీద పడుకున్నది నేను కాదూ?"

"ఓహో! అది మీదా? భలే విచిత్రంగా వుంది! మీరు ఇప్పుడు ఆత్మగా తిరుగుతున్నారా – ఆ ఒంటిని వదిలేసి?" చిలిపితనం మేళవించి అడిగాడు.

"అర్థం కావడం లేదూ? పెద్ద మేధావులం అని విర్రవీగుతున్నారుగా?" కోపంగా ఎదురు ప్రశ్నించింది ఆ స్వరం.

"అబ్బే... మేం తాతకు దగ్గులు నేర్పేంత వాళ్ళమా? అదీగాక తాత... తాత... తాత (చాలా సేపు గాలి ఉగ్గబట్టి – వదిలి) ము..త్తా...తకి!" చేతులు బార్లా చాపి, చిన్న పిల్లవాడిలా చిలిపిగా అన్నాడు.



## మిథున్ మందు మానేశాడు

ఔను. మందు, మాంసాహారం రెండూ మానేశానని మాజీ మహా తాగుబోతు మిథున్ చక్రవర్తి చెప్పాడు. "రోజూ సాయంకాలం కాగానే నేను సీసా పెట్టుకు కూచుని అర్ధరాత్రి దాటే వరకు తాగుతుండే వాణ్ణి. నన్ను మందు మాన్పించడం కోసం మా పిల్లల్ని నా మీదకు రెచ్చగొట్టిందీ మా ఆవిడ. ఒక నాడు మా పిల్లలిద్దరూ నా దగ్గర కొచ్చి 'హీరో నువ్వు నిజంగా మమ్మల్ని లవ్ చేస్తున్నావా! అయితే ఇక నుంచి నువ్వు తాగకూడదు' అని పట్టుపట్టారు. ఆ రోజు నుంచి మానేశాను. మందు మానాక బరువు తగ్గి ఇప్పుడు ఫ్రెష్‌గా వున్నాను కదూ! అదీ గాక 'స్వామి వివేకానంద' సినిమాలో రామకృష్ణ పరమహంసగా నటించిన ఇరవై రోజుల్లోనూ నాలో ఏదో తెలియని మార్పొచ్చింది" అన్నాడు మిథున్.

'ఏమిటా వేళాకోళం? సరిగ్గా మాట్లాడలేవూ?'

'ఓ... సారీ నాకు ఒక చిన్న సందేహం... ఇప్పుడు నేను మిమ్మల్నే ముత్తాత అనాలా లేక మీరు నన్ను తాత అనాలా?'

'అదేం అనుమానం?'

'అనుమానం కాదు – వాస్తవమే! మా సైంటిస్టుల పరిశోధనల ప్రకారం చనిపోయేనాటికి మీకు ఇరవై – ఇరవై ఐదు సంవత్సరాలకు మించి వుండవు. నా వయస్సేమో ఇప్పుడు అరవై దాటింది... అందుకని!'

'అనుమానం సరైనదే! ఆత్మల వయస్సు ప్రకారం నేను నీ కన్నా చాలా పెద్దవాడిని... అదీగాక, నా అవశేషాల వయస్సు కూడా 5,300 సంవత్సరాలపై చిలుకే – కాబట్టి నువ్వు నన్ను 'ముత్తాతా' అని పిలవకతప్పదు! – బాధగా పలికింది స్వరం.

'అన్నట్టు, ఇంకో విషయం – నాదీ నీదీ మానవ జాతే అయినా మన రంగువేరు కదా – అదీగాక మాదీమీదీ వేరే ఖండం – వేరే దేశం! కాబట్టి మనవి వేరే జాతులు – నీ రక్తం నా రక్తం కలిసే ప్రసక్తిలేదు; కాబట్టి నిన్ను పెద్దాయనా అని పిలుస్తాను'

'ఈ జాతి, దేశ బేధాలు ఇంకా పోలేదన్నమాట! ఆనాడు మేము ఎలా తగలడ్డామో మీరు సరిగ్గా అలాగే వున్నారన్నమాట!'

నిట్టూర్పు!

'ఆర్యా! ఆ విషయం మీ కళేబరం బయల్పడిన రోజున కూడా తలెత్తింది. కదా – వినలేదా? నీ బాడీ సగం ఇటలీలోను – సగం ఆస్ట్రియాలోనూ, (అంటే సరిహద్దుకి ఇవతల – అవతల అన్నమాట) మంచులో కప్పబడి వుందట – త్రవ్వి తీసినపుడు. కాబట్టి నువ్వు ఆస్ట్రియాకి చెందుతావా లేక ఇటలీకి చెందుతావా... అని కాస్త గుంపుచింపులు పడ్డారే! మీ 'జాతివాళ్ళు'!

'అలాగా! నా కళేబరం బయటపడినపుడు నేను అక్కడ లేను; కాస్సేపు చెట్లగాలి అనుభవిద్దామని వెళ్ళాను. వేల సంవత్సరాల నించీ కాపలా కాస్తూ వున్నాను ఈ దేహాన్ని – ఓ క్షణం కూడా విడవక! నేను లేనిది చూసి, మీ వాళ్ళు నా దేహాన్ని తెచ్చి ఈ ఊపిరి ఆడని గదిలో పడేశారు' బాధగా అంది.

'ఏమిటీ! వేల సంవత్సరాల నించి ఆత్మ రూపంలోనే మిగిలిపోయావా? హిందూ ధర్మం ప్రకారం ఈ పాటికి ఎన్నో జన్మలు ఎత్తివుండాలే?' ఆశ్చర్యంగా అడిగారు డాక్టర్ బోసు.

'మరో జన్మకూడానా? ఎత్తిన జన్మలలో పూర్తిగా కోరికలు తీరక, నిర్జీవమైన నా సుందరరూపాన్ని విడిచి వెళ్ళలేక, అక్కడే వుండిపోయాను. నా మనోసంకల్పం అటువంటిది. అదీగాక, నేను అక్కడే వుండిపోవడానికి మరో బలమైన కారణం వుంది!' అర్థోక్తిగా ఆపేసింది.

డాక్టర్ విలియమ్ ఊపిరిపీల్చడం మరిచినట్టు ఆ సంభాషణ వింటున్నాడు.

'మరో కారణమా? ఏమిటది?' ఉత్కంఠతో అడిగాడు డాక్టర్ బోసు.

'మీరు చాలా మేధావులు కదా! ఇన్ని విషయాలు కనుక్కున్నారు. ఆ విషయం కూడా నేను చెప్పకుండా కనుక్కోరాదూ?'

'కాస్త ప్రయత్నిస్తే అది ఏమంత కష్టమైన పని కాదు. మీకులాగా మేము అనాగరికులము కాదు – నాగరికత తెలిసిన మేధావులము. మేము పూనుకుంటే అసాధ్యమైన పని ఏదీ లేదు ఈ లోకంలో!'

పకపకా నవ్వింది ఆ స్వరం – అలవు వచ్చేంత వరకు.

డాక్టర్ బోసు ఉక్రోషంగా చూస్తూ 'ఎందుకా నవ్వు? మేం అంతచేతకాని వాళ్ళలా కనిపిస్తున్నామా?' అన్నాడు.

'కాదు – కాదు! నీ అజ్ఞానానికి నవ్వుతున్నాను. నీ అహంకారాన్ని చూసి నవ్వుతున్నాను! కొన్నివేల సంవత్సరాల క్రితం మేముకూడా మీకులాగే మిడిసిపడే వాళ్లము; మా ఆయుధసంపత్తి, నాగరికత చూసుకుని. మా ముందుతరాల వారితో పోల్చుకుని, చాల నాగరికులమని మురిసిపోయేవాళ్ళము. ఇప్పుడు మీరు వాడుతున్న ఈ యంత్ర పరికరాలు అప్పుడు లేవు – అయినా మా సమకాలీనుల్తో పోలిస్తే మేము గొప్ప మేధావులము; రాగి వస్తువులు వాడేవాళ్ళం కాబట్టి – అలాగే మేము యుద్ధవిద్యలలో ఆధునిక ఉపాయాలు తెలిసినవాళ్ళము – కాని, ఇప్పుడు! మీ దృష్టిలో అనాగిరికులము – మోట మనుష్యులము! కొన్ని వేల సంవత్సరాల తర్వాత మీకు కూడా మా గతి పట్టకతప్పదు. అందుకే నవ్వు వచ్చింది.'

డాక్టర్ బోసు, డాక్టర్ విలియమ్ అప్రతిభుల్లై వింటూండిపోయారు.

'అది సరేగాని అబ్బాయ్ – ఇన్ని కనుక్కున్నారు – 'మనస్సుని' కనుక్కునే యంత్రాన్ని గనుక్కున్నారా?' అందా స్వరం మళ్ళీ.

గతుక్కుమని ఒకరి మొహాలొకరు చూసుకున్నారు; ఆ సైంటిస్టులు.

'లేదు' గొంతు పెగుల్చుకుని చెప్పాడు డాక్టర్ బోసు.

'ఎంచేత?'

'ఎందుచేత అంటే... ఆ మనస్సుకి ఆకారం లేదుకనుక. నువ్వు తొడిగిన బూట్లు ఏ తోలుతో చేయబడ్డాయి – ఆ బూట్లలో కూరిన గడ్డి ఏ మొక్కది – ఏ ప్రాంతంలో పెరుగుతుంది? నువ్వు ఏం తినేవాడివి – నీ ఒంట్లో ఏం జబ్బులున్నాయి వంటి వివరాలు రేడియో కార్బన్ టెస్ట్‌ద్వారా, లేక ఇతర పరిశోధనల ద్వారా తెలుస్తాయి – కాని, ఆకారం లేని మనస్సుని ఎలా పరిశోధించగలం?" ఎదురు ప్రశ్నించాడు డాక్టర్ బోసు.

అయితే ఒప్పుకుంటున్నావన్నమాట! మీ ఆధునికులకు కూడా అసాధ్యమైన పనులు ఈ భూమిమీద వున్నాయని... ఆ కష్టమైన పనులలోకెల్ల అతి కష్టమైన పని 'మానవుడి మనస్సుని' విశ్లేషించి, దాన్లో ఇమిడి వున్న అనేక భావాలను కనిపెట్టడం! కాదంటావా?'

డాక్టర్ బోసు విస్తుపోయి నిలబడిపోయారు.

## శారదకు ఎన్ని పేర్లు?

'ఊర్వశి' శారదకు తులాభారం (1968), స్వయంవరం (1972), నిమజ్జనం (1979) చిత్రాల ద్వారా మూడుసార్లు జాతీయ ఉత్తమనటి (అప్పట్లో ఊర్వశి అనేవారు. ఇప్పుడు కాదు) అవార్డులు లభించాయి. ఆ మూడు చిత్రాల్లోనూ మొదటి రెండూ మళయాళం కాగా, మూడోది తెలుగు.

ఆంధ్రా పారిస్ తెనాలికి చెందిన శారద "మా తాతగారు మళయాళీ. అందువల్లే మళయాళం సినిమాల్లో బాగా రాణించగలిగానేమో" అంది. మొదటి మళయాళ సినిమాలో శారద తన పేరును 'రాహెల్' గా మార్చుకుని, కేరళలో ఎక్కువగా వున్న క్రిస్టియన్స్‌ను ఆకర్షించింది. కానీ రెండో సినిమా నుండీ 'శారద'గానే వుండిపోయింది.

ఇప్పటికి మొత్తం నూట యాభై తెలుగు, పదహారు తమిళ, హిందీ, కన్నడాలలో నాలుగేసి సినిమాలు చేసింది.

సినిమాల్లోకి రాకముందు నాగభూషణం 'రక్తకన్నీరు' నాటకంలో వేషాలేసిన శారద అసలు పేరు 'సరస్వతి.'

–శివసూర్య



ఏం జవాబు చెప్పాలో తెలీక.

'ఒప్పుకుంటున్నావా?'

'ఊ... సరే ఒప్పుకుంటాను. ఇంతకీ నువ్వు పునర్జన్మ ఎత్తకపోవడానికి మరో కారణం వుందన్నావు – అదేమిటో చెప్పలేదు. నువ్వు చెప్పకపోతే మేము ఎప్పటికీ తెలుసుకోలేము – మానవుడి 'మనస్సు' యుగయుగాలనించి ఛేదించలేని ధృడమైన కోట లాంటిదే! బ్రతికి వుండి, మాట్లాడేవాళ్ళ మనస్సులే అర్థంకావు – ఇక నీ మనస్సులోని మాట ఎలా తెలుస్తుంది?'

'కాసేపు మౌనం! శాస్త్రవేత్తలు ఆసక్తిగా కంప్యూటర్ వేపు చూస్తున్నారు! ధ్వని మొదలయింది. ధ్వని కంప్యూటర్ స్క్రీన్‌మీద అక్షరాలవుతున్నాయి.

'అందాక మనస్సు కథ!' నిట్టూర్పు.

'ప్రేమకథలా వుందే? అదే! మీరు ఇప్పుడు ఆస్ట్రియా, ఇటలీ అని పిల్చుకుంటున్న ప్రాంతాల సరిహద్దుల్లో రెండు గ్రామాలువుండేవి – పక్క పక్కగా. మమ్మల్ని విడదీస్తూ ఆల్ప్స్ పర్వతశ్రేణి! మేము ఆస్ట్రియా అని పిలవబడుతున్న ప్రాంతంలో వున్న గ్రామస్థులం. ఇటలీ ప్రాంతంలో వున్న గ్రామంలో నా 'ప్రేమదేవత' వుండేది! మేము పెళ్ళి చేసికోవాలనుకున్నాము. కాని, మా రెండు గ్రామాలకి బద్ధవిరోధం!

నా ప్రియురాలి గ్రామం వాళ్ళు మాకంటె చాల అనాగరికులు. మేము అప్పటికే రాగితో ఆయుధాలు, వంటసామాగ్రి తయారుచేసేవాళ్ళం. వ్యవసాయం చేసేవాళ్ళం. పాడిపంటలతో మా దేశం కళకళలాడుతూ వుండేది. వాళ్ళ దేశంలో చాలవరకు నీళ్ళే – రాగి దొరకదు – చుట్టూ సముద్రం! ఇళ్ళు నీళ్ళమీదే మంచెలు కట్టి వేసుకునేవాళ్ళు... బొత్తిగా రాతియుగం మనుష్యులు! అయినా నా ప్రేయసి మట్టిలో మాణిక్యంలా నవనాగరికతతో మెరిసేది. ఆమె గ్రామస్థులు మమ్ములను చూచి అసూయపడేవాళ్ళు; వాళ్ళకు లేని నాగరికత మాకూ వుండకూడదని వాళ్ల అసూయ. సమయం వస్తే చాలు మా గ్రామం వాళ్ళతో కయ్యం పెట్టుకోవాలని చూసేవాళ్ళు! మా వాళ్ళు ఆయుధాలు ధరించినా యుద్ధప్రియులు కారు.

నా ప్రేయసీ – నేను ఆ విరోధాలకి అతీతంగా తరచూ ఓ స్థలంలో కలుసుకునేవాళ్ళం! మీరు నన్ను తవ్వివేశారే – అదే మా సంగమస్థలం!

అది శిశిర ఋతువు. చెట్లు ఆకులు రాలి మోడుల్లా మారాయి. నా ప్రేయసిని బలవంతంగా ఎవరికో ఆ ఊర్లోనే ఇచ్చి పెళ్ళిచేయబోతున్నారు. మాకు భయంవేసింది. యుద్ధంచేసి ఆమెని తీసుకురావచ్చు – కాని రక్తపాతం నాకిష్టం లేదు!

మేము కలుసుకునే చోటు మా దేశాన్ని విడదీసే సరిహద్దురేఖకి అంగుళం ఇవతల వుండేది. ఆమె ఎలాగైనా తన వాళ్ళకళ్ళుగప్పి ఆ రేఖదాటి ఇవతలికి వచ్చిందంటే చాలు – మా గ్రామంలోకి



తీసికెళ్ళి పెళ్ళి చేసికోవచ్చు. మా గ్రామంలోకి కాలు పెట్టడానికి వాళ్ళు ఏ విధంగానూ సాహసం చెయ్యలేరు.

అన్ని సన్నాహాలు చేసుకున్నారు. ఆ రోజు సాయంత్రం కనుచీకటి పడేవేళకు ఆమె నన్ను కలుసుకుంటానన్న ప్రదేశానికి వెళ్ళాను. వాతావరణం బాగోలేదు.

నేను మంచులో వణుకుతూ నా ప్రేయసి కోసం , ఎదురుచూస్తున్నాను. ఆమెకోసం తెచ్చిన చెర్రీపళ్ళు సంచీలో అలాగే వున్నాయి. అవి ఆమెకి ఇష్టమని దార్లో కోసుకొచ్చాను. మంచుతుపాను రేగేట్లుగా వుంది. ఆమె ఇంకారాలేదు. నాలో ఆదుర్దా ఎక్కువయింది.

ఇంతలో నా నిరీక్షణ ఫలించి, అల్లంత దూరంలో ఆమె పరుగులుతీస్తూ వస్తోంది. నేనూ ఆశగా ఎదురువెళ్తున్నాను – ఇంతల్లో ఆమెను వెంబడిస్తూ పరిగెడుతున్న జనం నా కళ్ళబడ్డారు. టక్కున ఆగాను. వాళ్ళంతా ఆమె గ్రామంవారు. కోలాహలంగా అరుస్తూ పరిగెత్తుకుని వస్తున్నారు. వాళ్ళ చేతుల్లో పదునుదేరిన రాతి ఆయుధాలు! నేనూ ఆయుధాలు ధరించే వున్నాను. కాని నాకు యుద్ధం మీద మనస్సుపోలేదు – పరిగెత్తుకొస్తున్న ఆ అమాయకురాలినే చూస్తున్నాను – ప్రేమమూర్తిలా, ఆర్తిగా పరిగెడుతున్న ఆమెను రక్షించాలని ముందుకు కదిలాను – అంతే!

టపటప మని ఆయుధాల వర్షం! ఎటూతోచక చేతులు అడ్డుపెట్టి నిల్చున్నాను – అయినా ఓ రాయి సూటిగా వచ్చి నా తలకు తగిలింది.! కళ్ళ ముందు నక్షత్రాలు ఫెళ్ళుమన్నట్లయింది. అంతే తర్వాత చాలా సేపటి వరకు ఏమీ అర్థంకాలేదు.

అర్థమయ్యేసరికి చుట్టూ పెనుచీకటి , ఈదురు గాలులతో కూడిన మంచుతుపాను! అక్కడ ఒక్క పురుగుకూడ లేదు... నేను తప్ప!

నా ప్రియురాలిని ఆమె గ్రామస్థులు ఎప్పుడో ఈడ్చుకుని వెళ్ళిపోయినట్లున్నారు – నేను నిస్సహాయంగా దుఃఖిస్తూ ఆ హిమవాహినిలో కూరుకుపోతున్నాను... మంచుతాకిడికి స్పృహకోల్పోయాను.

మెలుకువ వచ్చేసరికి నేను నా దేహంనించి విడిపోయినట్లు అర్థమయింది. తిరిగి నా దేహంలోకి ప్రవేశించాలని శతవిధాలా ప్రయత్నించి విఫలమయ్యాను. దుఃఖిస్తూ అక్కడే కూర్చున్నాను – ఎప్పటికైనా నా ప్రేయసి నన్ను వెదుక్కుంటూ అక్కడికి వస్తుందని! మీరు చెప్పేవరకు ఇన్నేళ్ళు గడిచాయని తెలేదు. ప్రపంచం పట్టకుండా నా కళేబరాన్ని జాగ్రత్తగా కాపలా కాస్తూ వున్నాను ఇన్నాళ్ళు! నా ప్రేయసి ఏనాటికైనా వచ్చి. నన్ను గుర్తుపడుతుందనే పిచ్చిభ్రమతో – ఆ భ్రమనేటితో తీరిపోయింది – నువ్వన్నట్లు నా యువరాణి ఇప్పటికి ఎన్ని జన్మలు ఎత్తిందో!' స్వరం రుద్ధమైంది. డాక్టర్ బోసు, డాక్టర్ విలియమ్ నిశ్చేష్టులై విన్నారు. ఆ కథను. వారి కళ్ళలో అశ్రుకణాలు!

డాక్టర్ కళ్ళు ఒత్తుకుంటూ అన్నాడు; 'అబ్బ ఎంత విషాదం! మీ తరం తర్వాత మరెన్నో జంటలు కూడా ఇటువంటి దురదృష్టానికి గురయ్యాయి... అయితే ఇవి తరతరాల్నించి జరుగుతున్న అరాచకాలే! మానవజాతిని పట్టిపీడిస్తున్న జాతి, మత, ప్రాంతీయ వైషమ్యాలు ఈనాటివి కాదన్నమాట!'

'అదే కదా బాబూ నేను చెప్పేది! నాగరికులమైన మాకు, మీకూ తేడా ఏముంది చెప్పు! ఈ నాగరికత నాశనానికే దారితీస్తున్నపుడు దాన్నిగురించి డప్పాలు కొట్టుకొని ఏం ప్రయోజనం? ఇక చాలు బాబూ – ఐదువేల ఏండ్ల తర్వాత కూడా మానవుడి బుద్ధి మారలేదంటే – ఈ మానవ జన్మమీదే రోతపుడుతోంది. దానికన్న ఆల్ప్స్ పర్వతాల్లో చెట్టునై పుడతాను – సెలవ్‌బాబూ ఇప్పటి వరకు ఓపిగ్గా నా మాటలు విన్నందుకు కృతజ్ఞతలు'

'అయ్యో! వెళ్ళిపోతున్నావా – వద్దు – వెళ్ళవద్దు...

పెద్దగా అరుస్తున్నాడు డాక్టర్ బోసు.

'ఏవన్నండీ వెళ్ళకంటున్నారు? కలేమైనా పడిందా?' తట్టిలేపింది భార్య విస్మిత.

దిగ్గున లేచి కూర్చుని చుట్టూ కలియచూశాడు. అయితే అదంతా కలన్నమాట! ఎంత విచిత్రమైన కల!

క్రితంరోజు బిబిసిలో టెలికాస్ట్ అయిన 'మంచు మనిషి' డాక్యుమెంటరీ చూశాడు. మంచుమనిషి ఎలా చనిపోయాడో అని ఆలోచిస్తూ నిద్రపోయాడు – అదే కలగా వచ్చింది.

'ఏం కలండి?' భార్య కుతూహలంగా అడుగుతోంది.

'ఆది మానవుడి మనస్సు కథ'

'మనసుకథ కలా?'

**'అవును – మా సైంటిస్టులు ఎన్నటికీ కనుక్కోలేని ఆది మానవుడి 'మనస్సు' కథ**

●●●●